మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 13-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 104 Issue: 104

13 అక్టోబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:12 సూర్యాస్తమయం - సా. 5:52 తిథిః సప్తమి మ. 12:28 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఆరుద్ర మ. 12:28 వరకు తరువాత పునర్వసు యోగం పరిఘ ఉ. 8:05 వరకు కరణం బవ మ. 12:28 వరకు భాలవ రా. 11:46 వరకు వర్జ్యం రా. 12:11 నుండి రా. 1:45 వరకు దుర్ముహూర్తం మ. 12:25 నుండి మ. 1:12 వరకు మ. 2:45 నుండి మ. 3:32 వరకు రాహుకాలం ఉ. 7:39 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:34 నుండి మ. 12:02 వరకు గుళికాకాలం మ. 1:29 నుండి మ. 2:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:36 నుండి తె. 5:24 వరకు అమృత ఘడియలు లేదుః అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:25 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


# కోడె మొక్కులు.. భీమన్నకెట్ల?



## భక్తులకు ముందస్తు సమాచారమేది?

**ఒక్క రోజులో నిర్ణయం ఎలా తీసుకున్నారు?.. రెండ్రోజుల్లో రాజన్న గుడి తెరవాల్సిందే**

**లేకపోతే మేమే వచ్చి గుడి తలుపులు తెరుస్తాం.. కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరికలు**

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఆదివారం నుంచి దర్శన భాగ్యం కల్పించకపోవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ భగ్గుమన్నారు. రాజన్నకు అందాల్సిన పూజా కైంకర్యాలు భీమన్నకు ఎలా చెల్లిస్తామని నిలదీశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ అధికారులపై మండిపడ్డారు. వివరాల్లోకెళితే.. వేములవాడ రాజన్న ఆలయంలో ప్రభుత్వం పలు అభివృద్ధి పనుల్ని చేపట్టింది. ముఖ్యంగా గర్భగుడి పరిసర ప్రాంతంలో పనుల్ని చేపట్టింది. దీనిలో భాగంగా ఆలయాన్ని కొన్ని రోజుల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

వేములవాడ, కరీంనగర్, అక్టోబర్ 12 (ఈవార్తలు): పూజలు, అభిషేకాలు, ఇతర అన్ని రకాల కైంకర్యాలు మాత్రం యథావిధిగా జరుగుతాయన్నారు. భక్తులు మాత్రం కోడె మొక్కులు, చండీ యాగం, ఇతర అన్ని రకాల పూజలు భీమేశ్వర ఆలయం వద్ద నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సీరియస్ అయ్యారు. అసలు భక్తులకు ముందస్తు సమాచారం లేకుండా ఒక్కరోజులో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ఏమిటని మండిపడ్డారు. రాజన్న కోడె మొక్కలు భీమన్నకు ఎలా చెల్లిస్తారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కోడె మొక్కలు రాజన్న ఆలయంలో చెల్లించుకోవడం సంప్రదాయమన్నారు. అంతేకాకుండా, ఆలయాన్ని దర్శించుకోకుండా మూసి వేస్తే.. తాము పంచలు కట్టుకుని వచ్చి ఆలయాన్ని తెరుస్తామని తేల్చిచెప్పారు. ప్రభుత్వానికి రెండు రోజుల సమయం ఇస్తున్నామని, నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఏది చేయాలో అది చేస్తామని తరువాయి 2 వ పేజీలో...

---



తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశారు. జేఏసీ ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ ఛైర్మన్‌గా వీజీ నారగోని వ్యవహరించనున్నారు. బీసీ జేఏసీలో ముఖ్యమైన ఆరుగురితో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం లక్డీకపూల్‌లోని అశోక హెూటల్‌లో బీసీ సంఘాలు సమావేశమయ్యాయి. బీసీ రిజర్వేషన్ల సాధనకై ఐక్యంగా పోరాడాలని బీసీ సంఘాలన్నీ ఒక్కటై బీసీ జేఏసీగా ఏర్పడ్డాయి. ఈ సమావేశంలోనే అక్టోబర్ 14న తలపెట్టిన బీసీ సంఘాల తెలంగాణ బంద్‌ను ఈ నెల 18కి వాయిదా వేయాలని బీసీ జేఏసీ నిర్ణయించింది.


# తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు

## చైర్మన్‌గా ఆర్ కృష్ణయ్య

### 42 శాతం రిజర్వేషన్ సాధనే లక్ష్యం

హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. యావత్ దేశాన్ని కదిలించే విధంగా బీసీ ఉద్యమం చేపడతామని అన్నారు. ఏదైనా ఒక రాష్ట్రంలో ఉద్యమం జరిగితే ఆ ప్రభావం ఇతర రాష్ట్రాల్లో కూడా పడుతుందని అన్నారు. బీసీల్లోని ప్రతి కుల నుంచి నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని.. వాళ్లకు తగిన బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమం ఇంతటితో ఆగదని.. బీసీలను చట్ట సభల్లో కూర్చోబెట్టేవరకు పోరాడతామని తేల్చిచెప్పారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 2025, అక్టోబర్ 18న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామని.. తరువాయి 2 వ పేజీలో...

---



### చీరాల వాడరేవు బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు మృతి

**మరో ఇద్దరు గల్లంతు.. కొనసాగుతున్న వెతుకులాట**

ఏపీలోని బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు బీచ్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సముద్రంలో ఈతకు వెళ్ళి ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. బీచ్‌లో ఐదుగురు గల్లంతవ్వగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

బాపట్ల, అక్టోబర్ 12 (ఈవార్తలు): వాడరేవు బీచ్‌కు చేరుకున్న బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులు విజయవాడ, ఇబ్రహీం పట్నం, సూర్యారావు పేటకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు సాయి మణి దీప్ , జీవన్ సాద్విక్, శ్రీ సాకేత్‌లుగా గుర్తించారు. గల్లంతైన మరో ఇద్దరు బాపట్లజిల్లా వేటపాలెం మండలం వడ్డే సంఘానికి చెందిన గౌతమ్ (15), షరాన్ (18) ల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన యువకులు రాకాసి అలల తాకిడికి రెండు వేరు వేరు ప్రమాదాలలో ఐదుగురు యువకులు -2 వ పేజీలో...

---

# నేనంటే అడ్లూరికి ఈర్ష్య

## నాపై కుట్రలు చేస్తున్నారు.. ఆయన్ను ప్రోత్సహించిందే కాకా

**మాల జాతి అని నన్ను విమర్శిస్తున్నారు.. మాలలంతా కలిసి ఉండాలి.. మంత్రి వివేక్ వెంకటస్వామి**



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఎందుకు తనను టార్గెట్ చేసి విమర్శిస్తున్నాడో అర్థం కావడం లేదని మంత్రి వివేక్ వెంకటస్వామి సంచలన ఆరోపణలు చేశారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మాల సోదరుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. లక్ష్మణ్‌కు నాపై ఎందుకంత ఈర్ష్య అని ప్రశ్నించారు. కష్టపడి పనిచేస్తున్న నాపై కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అడ్లూరి లక్ష్మణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయనను రాజకీయాల్లో ప్రోత్సహించిందే తన తండ్రి వెంకటస్వామి (కాకా) అని చెప్పారు.

నిజామాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): 'హైదరాబాద్‌లో జరిగిన మాలల గర్జన వల్ల మాలల్లో ఐక్యత పెరిగింది. దేశంలో ఒక సామాజిక వర్గానికి చెందిన సభ అంత పెద్దగా జరగటం ఇదే మొదటిసారి. మాలల కోసం పోరాటం చేస్తుంటే కొందరు కుట్రలతో సోషల్ మీడియా వేదికగా తనను అవమానించే ప్రయత్నం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచి 18 శాతానికి పెంచాలని తీర్మానం చేశాం, కానీ అలా జరగలేదు' అన్నారు. 'రోస్టర్ విధానంలో మాలలకు అన్యా యం జరిగింది. పోరాడితేనే ఫలితాలు వస్తాయి. దేశంలో ఇంకా కులవివక్ష ఉంది. మాల ఉద్యోగులకు వేధింపులు తప్పటం లేదు. మంత్రిగా నా పని నేను చేసుకుంటూ పోతున్నా. ఆయన నా మీద కావాలనే విమర్శలు చేస్తున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ -2 వ పేజీలో...

---



# వివేక్ విజ్ఞతకే వదిలేస్తున్నా

**కాకా అంటే అభిమానం ఉంది**

**పొన్నం వ్యాఖ్యలను వివేక్ ఖండించలేదు**

**తెల్లారే వ్యక్తిగతంగా ఫోన్ చేస్తాడనుకున్నా**

**కానీ, నా పేరు తీసి మాట్లాడారు**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

నిజామాబాద్‌లో మాల సోదరుల ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లి తన సహచర మంత్రి వివేక్ మాట్లాడటం బాధాకరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 'లక్ష్మణ్ కుమార్ తండ్రి జయంతి కార్యక్రమాల్లో పేరు పెట్టకపోతే ప్రశ్నిస్తున్నాడు. ఇతర ఇన్విటేషన్స్‌లో పేరు లేకపోతే ఎందుకు ప్రశ్నించడని వివేక్ మాట్లాడటం బాధాకరం.

ధర్మపురి, అక్టోబర్ 12 (ఈవార్తలు): నేను ఆ విషయమే అసలెక్కడా మాట్లాడలేదు. వెంకటస్వామి జన్మదిన వేడుకలను నా ధర్మపురి నియోజకవర్గంలో అత్యంత వైభవంగా జరిపాకే నేను హైదరాబాద్ వెళ్లాను. నాకు ఆ అభిమానం ఉంది. నా మైనార్టీ శాఖ కార్యక్రమానికి వారే వచ్చి.. వస్తడా? రాడా? వెళ్లిపొమ్మంటరా? అంటూ మాట్లాడటం ఎంతవరకు సబబు? సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ నన్ను ఓ జంతువుతో పోలుస్తూ మాట్లాడితే కనీసం సహచర దళిత మంత్రిగా ఖండించకపోవడాన్నే నేను ప్రశ్నించా. తెల్లారే వ్యక్తిగతంగా -2 వ పేజీలో...

---



# ఆ రాత్రి ఆమె బయటికి ఎందుకు వెళ్లింది?

**ఆత్యాచార బాధితురాలి ఘటనపై బెంగాల్ సీఎం**

దుర్గాపూర్/కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరగడంపై సీఎం మమతా బెనర్జీ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అర్ధరాత్రి సమయంలో విద్యార్థిని బయటకు వెళ్లడాన్ని మీడియా సమక్షంలో ప్రశ్నించారు. అసలు అర్ధరాత్రి సమయంలో విద్యార్థులను క్యాంపస్ నుండి బయటకు ఎలా వెళ్లనిచ్చారని నిలదీశారు. ఇది సరైన పద్ధతి కాదని, -2 వ పేజీలో...

---

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,508 |
| వెండి (గ్రాము): | రూ.190 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,542 |

---

### విశ్వవాణి



1200 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా తట్టుకొనే ఫైర్ రెసిస్టెంట్ ఫైర్ ఫైటర్ దుస్తులను చైనా అభివృద్ధి చేసింది. అంత ఉష్ణోగ్రతలోనూ ఆ దుస్తులు కుచించుకుపోవు, కరిగిపోవు, తమ సామర్థ్యాన్ని కోల్పోవు.

---

# ఏఐజీలో 'ఠాగూర్' సీన్




**కాలేయ మార్పిడి చికిత్స పొందుతూ మురళీధర్ అనే వ్యక్తి మృతి**

**వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ**

**45 రోజుల చికిత్సకు రూ.85 లక్షలు వసూలు చేశారని ఆవేదన**

**14 లక్షలు కట్టించుకున్నాకే మరణవార్త చెప్పారని బంధువుల కన్నీరు**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రి వద్ద ఆదివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాలేయ మార్పిడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. భారీగా డబ్బులు వసూలు చేసి, చివరికి ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, కుత్బుల్లాపూర్‌కు చెందిన మురళీధర్ (40) కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.

గచ్చిబౌలి/హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): మెరుగైన చికిత్స కోసం 45 రోజుల క్రితం ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. కాలేయ మార్పిడి అవసరమని వైద్యులు చెప్పడంతో, అవయవదానం కోసం జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, మురళీధర్ వయసు 40 ఏళ్లు కాగా, ఆసుపత్రి సిబ్బంది పొరపాటున 60 ఏళ్లుగా నమోదు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ తప్పిదం వల్ల అవయవదాతలు ఎవరూ ముందుకు రాలేదని, దీంతో చివరికి అతని భార్యే కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకొచ్చారని -2 వ పేజీలో...

---



# స్పెషల్ సైబర్ ఆపరేషన్

**59 మంది నిందితుల అరెస్ట్.. బాధితులకు 86 లక్షలు రీఫండ్**

సినిమాల పైరసీ గ్యాంగ్‌పై తెలంగాణ సైబర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వివిధ ఆపరేషన్ల ద్వారా 8 రాష్ట్రాల్లోని 59 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు సెప్టెంబర్- 2025లో నమోదైన సైబర్ కేసులు, అరెస్ట్ వివరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మీడియాకు వెల్లడించారు.

హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): సైబర్ క్రైమ్స్ డీసీపీ దారా కవిత తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్‌లో మొత్తం రూ. 86,64,827 మొత్తాన్ని బాధితులకు రిఫండ్ చేశారు. దేశవ్యాప్తంగా 320 కేసులు నమోదు కాగా, 222 కేసులు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లలో.. మరో 106 కేసులు జోనల్ సైబర్ స్టేషన్లలో -2 వ పేజీలో...

ఈవార్తలు
ఆదివారం 13-10-2025

# రాశి ఫలాలు

13.10.2025

మేషం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. కుటుంబ సభ్యులతో దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన వ్యవహారాలలో విజయం లభిస్తుంది. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో ఉంటాయి. బంధు మిత్రుల నుండి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. వృథా ప్రయాణాలు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారములు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు కలుగుతాయి. సన్నిహితులతో అకారణ విభేదాలు తప్పవు. అవసరానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

మిథునం: వ్యాపారపరంగా ఉన్న ఇబ్బందులు క్రమ క్రమంగా తొలగుతాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహన, గృహ యోగములు ఉన్నవి. చిన్ననాటి స్నేహితులతో పాత జ్ఞాపకాలు పంచుకుంటారు. నిరుద్యోగుల ప్రయత్నాలు కలసివస్తాయి.

కర్కాటకం: నూతన వ్యవహారాలకు శ్రీకారం చుడతారు. దగ్గరి వారి నుండి కీలక విషయాలు తెలుస్తాయి. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశములు లభిస్తాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పదవులు లభిస్తాయి. వ్యాపారమున లాభాలు కలుగుతాయి.

సింహం: దైవ సంబంధిత విషయములలో ఆసక్తి పెరుగుతుంది. చేపట్టిన పనులందు ఆటంకాలు తప్పవు. ఇంటా బయట సమస్యలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిన్న పాటి సమస్యలు తప్పవు. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

కన్య: సంతాన విద్యా విషయాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమాధిక్యత తప్పదు. వ్యాపార, ఉద్యోగాలలో ఆందోళనలు పెరుగుతాయి. ఆత్మీయులతో అకారణ కలహ సూచనలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి.

తుల: వృత్తి, ఉద్యోగాలు సంతృప్తికరంగా ఉంటాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించుటకు అనుకూల సమయం. ఉన్నత విద్యా ప్రయత్నాలు కలసివస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన సమావేశములకు ఆహ్వానాలు అందుతాయి. సంతాన శుభకార్య విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుంచి విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. కొత్త పరిచయాల వలన ఆర్థిక లాభాలుంటాయి. వ్యాపార ఉద్యోగాలలో అభివృద్ధి కలుగుతుంది. సోదరులతో స్థిరస్తి ఒప్పందాలు చేసుకుంటారు.

ధనస్సు: దూర ప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. మానసిక ప్రశాంతతకు దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. బంధు మిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి.

మకరం: వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం వలన నష్టాలు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. నిరుద్యోగ యత్నాలు కలిసిరావు. నూతన ఋణ ప్రయత్నాలు కలిసిరావు. ఇతరులతో ఆలోచించి మాట్లాడటం మంచిది.

కుంభం: భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. ఆత్మీయులతో వున్న వివాదాలకు పరిష్కారం లభిస్తుంది. దైవ సేవ కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

మీనం: చేపట్టిన పనులందు శ్రమ అధికమౌతుంది. ఇతరులతో కొన్ని విషయాలలో మాట పట్టింపులు పెరుగుతాయి. గృహ నిర్మాణ పనులు వాయిదా వేస్తారు. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. దాయాదులతో స్థిరస్తి విషయమై ఉన్న సమస్యలు కొంత ఆందోళన కలిగిస్తాయి.




# కోడె మొక్కులు భీమన్నకెట్ల?

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. 'కొంత మంది ఏడాది పాటు, మరికొంత మంది ఆర్నెళ్ల పాటు ఆలయం మూసి వేస్తారని చెప్తున్నారు. దీనిపై సరైన క్లారిటీ కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. రాబోయేది కార్తీక మాసం. ఇలాంటి సమయాల్లో ఇలాంటి నిర్ణయాలు ఎంత వరకు కరెక్ట్?' అని ధ్వజమెత్తారు. ఆలయ అభివృద్ధిని తాము అడ్డుకోవడం లేదని, కానీ అనాలోచితంగా, ఇష్టమున్నట్లు తీసుకుంటున్న ప్రభుత్వం నిర్ణయానికి మాత్రం తాము వ్యతిరేకమన్నారు. ప్రజలు, భక్తుల సమ్మతి తీసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్లాలన్నారు. పబ్లిసిటీ కోసం ఆలయాల్లో వివాదాలు చేస్తే చూస్తు ఊరుకోబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## రాజన్న ఆలయం వద్ద భక్తుల ఆందోళన

రాజన్న ఆలయం ముందు భక్తులు, బీజేపీ నేతల ఆందోళన దిగారు. ఆలయం మూసివేసి రాజన్న భక్తులను అవమానిస్తున్నారా? అని మండిపడ్డారు. గుడిలో దర్శనాల నిలిపివేతపై అధికారులు పూర్తిగా క్లారిటీ ఇవ్వలేదని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈవోతో బీజేపీ నేతల వాగ్వవాదానికి దిగారు. దర్శనాలు నిలిపివేయలేదని ఈవో నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.

## ఆరెస్సెస్ యూనిఫాంలో బండి సంజయ్

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ లో పథ సంచలన్ (ఆరెస్సెస్ కవాతు) జరిగింది. ఈ కవాతులో కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. ఆరెస్సెస్ యూనిఫాంలో ఆయన కనిపించారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌గా కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఆరెస్సెస్ కవాతులో పాల్గొన్నారు. రాంనగర్ నుండి శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ గ్రౌండ్ వరకు రూట్ మార్చ్ సాగింది. రాంనగర్ సత్యనారాయణ స్వామి టెంపుల్ నుండి ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్‌లో బండి సంజయ్ పాల్గొన్నారు. కరీంనగర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తగానే బండి సంజయ్ జీవితం ప్రారంభమైంది. చదువుకునే సమయంలో రాంనగర్ బస్తీలో ముఖ్య శిక్షక్‌గా కొనసాగారు.



# అడ్లూరికి ఈర్ష్య

మొదటి పేజీ తరువాయి

అంశంలోనూ అనవసరంగా నా పేరు ప్రచారం చేశారు. మంత్రి అడ్లూరిని రాజకీయంగా ప్రోత్సహించింది కాకా. మంత్రి అడ్లూరిని కావాలనే నా మీద విమర్శలు చేస్తున్నారు' అని వివేక్ ఆరోపించారు. 'నాది మాల జాతి అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నన్ను విమర్శిస్తున్నారు. నాకు మంత్రి పదవి మీద మోజు లేదు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్ట పడుతున్నాం. నేను ఇన్‌చార్జ్ అయ్యాక జూబ్లీ హిల్స్‌లో ఓటింగ్ శాతం పెరిగింది. ఒక వర్గం మీడియా కావాలనే నన్ను టార్గెట్ చేసింది. నేను నిజాయితీగా ఉన్నా. నిజాయితీగా వ్యాపారాలు చేస్తున్నా. మాలలు అంతా కలిసి ఉండాలి' అని ఆయన కోరారు.

# ..ఎందుకు వెళ్లింది?

మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల క్యాంపస్‌లు అనేవి అత్యంత పకడ్బందీగా ఉండాలని ఆమె అన్నారు. అయితే, ఈ ఘటనకు పాల్పడిన నిందితుల్ని పట్టుకుని శిక్ష పడేలా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న కాలేజీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. నైట్ కల్చర్‌కు విద్యార్థుల్ని దూరంగా ఉంచాల్సిన బాధ్యత ఆయా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. మరో వైపు విద్యార్థులు కూడా తమని తాము రక్షించుకునేలా ఉండాలన్నారు. ఆ విద్యార్థిని కాలేజ్ క్యాంపస్ నుండి రాత్రి 12.30 గంటలకు ఎలా వచ్చిందన్నారు. ఇక బీజేపీ అధికారంలో ఉన్న ఒడిశాలో కూడా ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయని, అలాగే ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్, బీహార్‌లలో కూడా అత్యాచార ఘటనలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మమతా బెనర్జీ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. బాధితురాలికి న్యాయం జరిగే మాటను పక్కను పెట్టి, వేరే ఏవో కథలు సీఎం మమత చెబుతున్నారని ధ్వజమెత్తింది. ఆర్జీ కర్, సందేశ్‌ఖలి తర్వాత, ఇప్పుడు ఈ భయంకరమైన కేసులో న్యాయం కాకుండా, ఆమె బాధితురాలినే నిందిస్తున్నారు' అని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా 'ఎక్స్' వేదికగా విమర్శించారు. అంటే సీఎం మమతా చెప్పేది ఏమిటంటే.. అర్ధరాత్రి అమ్మాయిలనేవారు బయటకు వెళ్లొదని చెబుతున్నారా? అంటూ ప్రశ్నించారు.



# స్పెషల్ సైబర్ ఆపరేషన్

మొదటి పేజీ తరువాయి

నమోదయ్యాయి. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్- 28, డిజిటల్ అరెస్ట్ -6, పార్ట్ టైమ్ ఇన్వెస్ట్‌మెంట్- 4 , మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ కేసులు- 2, క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్-4, మూవీ పైరసీ-3, జాబ్ ఫ్రాడ్-1, ట్రేడింగ్ ఫ్రాడ్1, సోషల్ మీడియా ఫ్రాడ్స్-4, ఇతర కేసులు-2 నమోదయ్యాయి. 59మంది నిందితులపై దేశవ్యాప్తంగా 257 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో మూవీ పైరసీ గ్యాంగుపై 74 కేసులు నమోదైనట్లు ఆమె వెల్లడించారు. నిందితుల దగ్గరి నుంచి మొబైల్ ఫోన్లు-43, చెక్ బుక్స్-9, పాస్‌బుక్స్, 23 డెబిట్ కార్డులు , ల్యాప్ ట్యాప్‌లు- 4, సిమ్ కార్డులు-21, షెల్ కంపెనీ స్టాంప్-1 స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు మూవీలను పైరసీ చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు సైబర్ పోలీసులు. సింగిల్, హిట్ ది థర్డ్ కేసు, కుబేర సినిమాల పైరసీ కేసుల్లో ఐదుగురు నిందితులని అరెస్ట్ చేశారు. నిందితులు తెలంగాణ, తమిళనాడు, బిహార్, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. 1 తమిళ్ బ్లాస్టర్స్, 5 మువీరూల్జ్ వంటి వెబ్‌సైట్ల ద్వారా పలు చిత్రాలను లీక్ చేస్తోంది ఈ మూవీ పైరసీ ముఠా. నిందితుల దగ్గర ఉన్న సీపీయూలు, ల్యాప్‌ట్యాప్స్, మొబైల్స్, హార్డ్ డిస్కులని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సీజ్ చేశారు. మరోవైపు సెప్టెంబర్‌లో డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.66,000 కాజేసిన గ్యాంగ్‌ని అరెస్ట్ చేశారు. మలక్‌పేటకు చెందిన రిటైర్డ్ డాక్టర్‌ని డిజిటల్ అరెస్ట్ పేరిట బెదిరింపులకి దిగారు. దీంతో మానసిక ఒత్తిడితో ఆయన గుండెపోటుకు గురై మరణించారు. ఈ క్రమంలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులని అరెస్టు చేశా. మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.25 లక్షల మోసం చేశారు. నిందితులు అనిశా మొహమ్మద్ యాసీన్, జోహర్ ఫాతిమా (కర్ణాటక), మహమ్మద్ అబ్దుల్ అమిర్(హైదరాబాద్)ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు 2, ట్యాబ్ 1, ల్యాప్‌ట్యాప్ 1, పాస్‌బుక్స్ 5, చెక్‌బుక్స్ 3, డెబిట్ కార్డులు 3 స్వాధీనం చేసుకున్నారు.

# వివేక్ విజ్ఞతకే వదిలేస్తున్నా

మొదటి పేజీ తరువాయి

ఫోన్ కాల్ అయినా చేస్తాడని భావించా. అదీకాక, మళ్లీ నిజామాబాద్‌కు వెళ్లి వ్యక్తిగతంగా నా పేరు తీసి మాట్లాడటం ఇక వివేక్ విజ్ఞతకే వదిలేస్తున్నా. రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉండి ఏదైనా ఉంటే కూర్చుని మాట్లాడుకుని తేల్చుకోవాలి తప్ప ఈ విధంగా కామెంట్స్ చేయడం బాధాకరం. నేను కాంగ్రెస్ వ్యక్తిని, వ్యక్తిగత విభేదాలు ఉంటే తర్వాత మాట్లాడుకుందాం. నేను కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉన్నా. కాంగ్రెస్‌లో పెద్దలు ఆశీస్సులతో ఇంత వరకూ వచ్చా' అని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

# ఏఐజీలో 'ఠాగూర్' సీన్




మొదటి పేజీ తరువాయి

వారు తెలిపారు. 45 రోజుల చికిత్స కోసం తాము సుమారు రూ.85 లక్షలు చెల్లించామని, ఉన్న ఒక్క ఇంటిని అమ్మి డబ్బు కట్టామని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, శనివారం మరో రూ.14 లక్షలు చెల్లించిన తర్వాతే మురళీధర్ మృతి చెందినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. డబ్బు కట్టించుకున్న తర్వాత మరణవార్త చెప్పడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం, జీవన్‌దాన్‌లో తప్పుడు సమాచారం నమోదు చేయడం వల్లే మురళీధర్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.


## ఇల్లు, భూమి అమ్ముకున్నా

స్వయంగా నా భర్తకు లివర్ ఇచ్చా. 15రోజులుగా ఆసుపత్రిలో వైద్యం చేస్తూ, కోలుకుంటున్నారని చెప్పి వరుసగా బిల్లులు కట్టించుకున్నారు. ఆసుపత్రి బిల్లులకు నా భూమి, ఇల్లు కూడా అమ్మేశా. రూ.85 లక్షలు కట్టాక.. ఇక కట్టలేమంటూ చెబితే, వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పి అంబులెన్స్‌లోకి నాభర్తను ఎక్కించి చనిపోయాడని చెప్పారు. కేవలం బిల్లుల కోసమో నా భర్త చనిపోయిన విషయం దాచిపెట్టి మమ్మల్ని మోసం చేసి బిల్లులు కట్టించుకున్నారు. ఆసుపత్రి బిల్లుల కోసం చేసిన మోసంతో.. నా ఆస్తులన్ని అమ్ముకుని నష్టపోయా. నా కుటుంబానికి న్యాయం చేయాలి. **- మృతుడి భార్య**

# తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. రాబోయే ఈ వారం రోజుల కార్యాచరణను ఇప్పటికే మొదలుపెట్టామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా పని చేసామో అంత కన్నా ఎక్కువగా బీసీ ఉద్యమాన్ని చేస్తామని స్పష్టం చేశారు. అన్ని పార్టీలను మా ఉద్యమంలో కలుపుకుని పోతామన్నారు.



# ముగ్గురు విద్యార్థులు మృతి

మొదటి పేజీ తరువాయి

సముద్రంలో గల్లంతయ్యారు. విజయవాడ, ఇబ్రహీం పట్నం కు చెందిన విట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుంటున్న మొత్తం ఏడుగురు స్నేహితులు ఆదివారం కావడంతో సరదాగా గడిపేందుకు వాడరేవుకు వచ్చారు. వీరిలో ఎంటెక్ చదువుతున్న సాయి మణి దీప్ (19), జీవన్ సాద్విక్, శ్రీసాకేత్ సముద్రంలో గల్లంతయ్యారు. కొద్దిసేపటికి విద్యార్థుల మృతదేహాలు సముద్రపు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి.

## విద్య, ఉద్యోగవాణి

### జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

గ్లోబల్ ఆర్‌పీఓ సర్వీసెస్ సంస్థ తమ క్లైంట్స్ ద్వారా బీఎస్సీ/జీఎన్ఎమ్ నర్సింగ్ చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. జీతం నెలకు రూ.2.5 లక్షలు. జర్మనీ భాష శిక్షణ, వీసా, ఎయిర్ ఫేర్, డాక్యుమెంటేషన్ మొదలైనవి ఉచితం. ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసుకుంటారు. అక్టోబర్ 12 నుండి 14 వరకు అమీర్‌పేట, హైదారాబాద్‌లో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలకు 9908880263ను సంప్రదించాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు

**రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్**



జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

## తప్పిపోయిన బాలుడు..!

**గంటలోనే వెతికి పట్టుకున్న పోలీసులు**




జగిత్యాల టౌన్, అక్టోబర్ 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకేంద్రంలో పార్కు సమీపంలో ఓ బాలుడు తప్పిపోగా, కేవలం గంటలోనే బాలుడిని వెతికి పట్టుకొన్నారు పోలీసులు. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో పార్కు సమీపంలో కోరుట్లకు చెందిన నిఖిల్ (8) తప్పిపోయాడు. తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, రంగంలోకి దిగి.. గంటలోనే పట్టణంలోని విజయపురి ప్రాంతంలో గుర్తించారు. బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. అతి తక్కువ సమయంలో బాలుడిని గుర్తించి, తల్లిదండ్రుల వద్దకు చేర్చినందుకు టౌన్ ఎస్సై సుప్రియ, సిబ్బందిని టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ అభినందించారు.



## 18 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దాతృత్వం**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 12 (ఈవార్తలు): నిరుపేదలైన 18 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేసి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పావని కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్సలను నిర్వహించారు. అనంతరం వారికి ఉచిత కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నివారించదగ్గ అంధత్వం భారతదేశంలోనే అత్యధికంగా ఉందని తెలిపారు. కన్ను సున్నితమైన జ్ఞానేంద్రియం అని, దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, నాయకులు సత్తి రెడ్డి, జైరాం సురేశ్, రంగు మహేశ్, సయ్యద్ గౌస్, మాజీ ఎంపీటీసీ మానాల వెంకటరమణ, మల్లేశ్, రహీం, హనుమయ్య, భీమన్న, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో 50 కోట్ల మోసం!

నల్గొండ, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఏడాదికి 240 శాతం వరకు వడ్డీ ఇస్తానని నమ్మబలికి, అమాయక ప్రజల నుంచి రూ.50 కోట్లకు పైగా అప్పులు సేకరించి మోసగించిన రమావత్ బాలాజీ నాయక్‌ను నల్గొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, పలు వ్యాపారాల్లో నష్టపోయిన నిందితుడు ఈ భారీ మోసానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నల్గొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఈ కేసు వివరాలు తెలిపారు. బాలాజీ నాయక్ తన మోసానికి గురైన వారిని నమ్మించడానికి వినూత్న పద్ధతులు ఎంచుకున్నాడని ఆయన వివరించారు. తన విలాసవంతమైన ఫార్చ్యూనర్, స్కార్పియో కార్లలో తిప్పుతూ, నల్గొండలోని ఐటీ టవర్‌ను చూపించి అది తన బంగ్లా అని చెప్పేవాడు. అంతేకాకుండా, ఖరీదైన విల్లాలు, వెంచర్ల వద్దకు తీసుకెళ్లి అవన్నీ తన ఆస్తులేనని నమ్మించి అప్పులు తీసుకునేవాడు. ఈ విధంగా సేకరించిన డబ్బును మద్యం వ్యాపారం, స్టాక్ మార్కెట్‌లో ఇంట్రాడే ట్రేడింగ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పెట్టుబడులుగా పెట్టి భారీగా నష్టపోయాడు. కేవలం మద్యం వ్యాపారంలోనే రూ.2.30 కోట్లు, స్టాక్ మార్కెట్‌లో రూ.12.15 కోట్లు పోగొట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నష్టాలు పెరగడంతో, జల్సాలు, విలాసవంతమైన జీవితాన్ని కొనసాగించడానికి మరిన్ని అప్పులు చేయడం మొదలుపెట్టాడు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్న సరియానాయక్ అనే వ్యక్తి తీవ్ర ఒత్తిడితో మరణించడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. అతడి మరణం తర్వాత ధైర్యం చేసిన కొందరు బాధితులు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు బాలాజీ నాయక్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.80 లక్షల విలువైన రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, పలుచోట్ల ఉన్న ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

# నేటి నుంచే 'జూబీహిల్స్' నామినేషన్లు

**షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద**

**144 సెక్షన్ విధింపు**




షేక్‌పేట, అక్టోబర్ 12 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల కేంద్రంగా ఉన్న షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఉప ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ర్యాలీలుగా వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల కార్యాలయం వద్దకు వాహనాలను పూర్తిగా నిషేధించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు కేవలం నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించనున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే 18 మార్గాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచారు. మరోవైపు, ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ తరఫున మాగంటి సునీత పేరును ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ కుమార్ బరిలో నిలవనున్నారు. బీజేపీ అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నామినేషన్లు వేయడానికి పది రోజుల సమయం ఉండటంతో, అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారు. పశ్చిమ మండలం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో ఈ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 9 మంది ఎస్ఐలతో పాటు 59 మంది సిబ్బంది, రెండు ప్లాటూన్ల బలగాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఈ భద్రతా వలయం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

# రాజ్యాంగం పవిత్రగ్రంథం కాదు

**దాన్ని 106 సార్లు సవరించారు**

**హిందువులపై రాజ్యాంగ వివక్ష**

**మైనారిటీగా ఉన్నచోట జీవనం ప్రశ్నార్థకం**

**సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు**



హైదరాబాద్, అక్టోబర్ 12 (ఈవార్తలు): భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమేమీ కాదని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అదే పవిత్ర గ్రంథమైతే, దానికి ఇప్పటివరకు 106 సార్లు సవరణలు ఎందుకు చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు. రామాయణం, భారతం, భగవద్గీత వంటి గ్రంథాలకు ఎటువంటి సవరణలు జరగలేదని ఆయన గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ క్లబ్‌లో పాత్రికేయులు, మేధావులతో నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "హిందువులకు సమాన హక్కుల నిరాకరణ, రాజ్యాంగ వివక్ష" అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో ఇతర మతాల వారు సురక్షితంగా జీవించగలుగుతున్నారని, కానీ ఎక్కడైతే హిందువులు మైనారిటీలుగా ఉన్నారో అక్కడ వారి మనుగడే ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కశ్మీర్ అంశాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కశ్మీర్‌లో 21 శాతంగా ఉన్న హిందువుల జనాభా, నేడు ఒక్క శాతం కూడా లేని దుస్థితికి చేరిందని తెలిపారు. లౌకికవాదం గురించి చెప్పే రాజ్యాంగం, కశ్మీర్‌లో హిందువులపై జరిగిన మారణహోమాన్ని ఎందుకు ఆపలేకపోయిందని ఆయన నిలదీశారు. విద్యా హక్కు విషయంలోనూ హిందువుల పట్ల వివక్ష కొనసాగుతోందని నాగేశ్వరరావు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 28, 29, 30 ప్రకారం క్రైస్తవులు, ముస్లింలకు విద్య అనేది ప్రాథమిక హక్కుగా ఉందని, కానీ హిందువులకు మాత్రం అది కేవలం పౌర హక్కుగానే పరిమితమైందని ఆయన విశ్లేషించారు.



## పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఆత్మహత్య

మల్యాల, అక్టోబర్ 12 (ఈవార్తలు): పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండల పరిధిలోని మద్దుట్ల గ్రామానికి చెందిన ఉప్పు శంకర్ (44) కూలి పని చేస్తున్నాడు. ఇతడికి ఆరేళ్ల క్రితం శిరీషతో పెళ్లైంది. అయితే, ఇన్నేళ్లైనా పిల్లలు పుట్టట్లేదని మనస్తాపం చెందాడు. మనోవేదనతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ఇష్టం.. పాపాలకు కారణం

**ఆధ్యాత్మిక వక్త చాగంటి కోటేశ్వరరావు**

**ధర్మపురిలో ఘనంగా ఆధ్యాత్మిక ప్రవచనం**

**హాజరైన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి, కలెక్టర్, ఎస్పీ**

ధర్మపురి, అక్టోబర్ 12 (ఈవార్తలు): ఇష్టం.. ప్రియం.. అనేదే పాపాలకు కారణం అయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో రెండు రోజుల ప్రవచన కార్యక్రమంలో భాగంగా ధర్మపురిలో ఉన్న ఆయన శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం జరిగిన ప్రవచన సభలో ఆయన మాట్లాడుతూ.. మనం చేసే పనులను ఈశ్వరుడు చూస్తుంటాడని, ప్రతీదానికి కర్మ ఫలితం అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ధర్మం, సంస్కృతి, మన సంస్కారాల ప్రాధాన్యం, కుటుంబ విలువలు, ఆధ్యాత్మికతపై స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, భక్తులు హాజరయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడిపెల్లి, అక్టోబర్ 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి- మోహన్ రావు పేట రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం కోరుట్ల వైపు బైక్‌పై వస్తున్న ఇల్లెందుల శ్రీనివాస్ (గుమ్లాపూర్) జగిత్యాల వైపు వెళ్తున్న కారును వేగంగా ఢీకొట్టాడు. ఎగిరిపడి, తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలు కాగా, స్థానిక దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## దామోదర్ రెడ్డి వల్లే

# నల్గొండకు నీళ్లు

**ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు**

**రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు ఖరారు**

**సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

తుంగతుర్తి, అక్టోబర్ 12 (ఈవార్తలు): దివంగత మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన గౌరవం ప్రకటించారు. ఆయన సేవలను చిరస్థాయిగా నిలిపేలా ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు 'రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రాజెక్టు'గా నామకరణం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రానున్న 24 గంటల్లోనే అధికారికంగా జీవో (ప్రభుత్వ ఉత్తర్వు) జారీ చేస్తామని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆదివారం నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్మారక సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నల్గొండ గడ్డపై గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే అది కేవలం దామన్న ధైర్యం, పట్టుదల వల్లే సాధ్యమైంది. ఆయన ఒత్తిడితోనే నాటి ప్రభుత్వం ఎస్సారెస్పీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లింది" అని గుర్తుచేశారు. తుంగతుర్తి ప్రజల అభివృద్ధి కోసం ఆర్‌డీఆర్ నిస్వార్థంగా పనిచేశారని సీఎం కొనియాడారు. దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, అధిష్ఠానం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని తెలిపారు. సోనియా గాంధీ స్వయంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారని వెల్లడించారు. ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరతాయని, ఇది దామోదర్ రెడ్డి ఆశయాలకు దక్కే నిజమైన నివాళి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## విజయవాడ నుంచి

# సింగపూర్‌కు ఇండిగో

**నవంబర్ 15 నుంచి సర్వీస్ ప్రారంభం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**




విజయవాడ, అక్టోబర్ 12 (ఈవార్తలు): విజయవాడ–సింగపూర్ మధ్య నూతన విమాన సర్వీసును ఇండిగో సంస్థ మరి కొద్ది రోజుల్లో ప్రారంభించనుంది. ఈ సేవను విజయవాడ నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ సర్వీసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. విజయవాడ నుండి వారానికి మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు ఉండనుందని, నవంబర్ 15 నుండి ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం కానుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయవాడ నుండి సింగపూర్‌లోని చాంగీ విమానాశ్రయానికి వారానికి మూడు సార్లు నేరుగా ఈ విమాన సర్వీసు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 28న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన సందర్భంగా ఈ విషయం చర్చకు వచ్చిందని రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. ప్రవాసాంధ్రుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే ఈ సర్వీసును ఏర్పాటు చేశామని ఆయన స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర 2047లో ప్రవాసాంధ్రుల పాత్ర అత్యంత కీలకమైనదని రామ్మోహన్ నాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు తన విజన్‌ను స్పష్టంగా అమలు చేస్తున్న నేపథ్యంలో విమానయాన అవసరాలు పెరుగుతాయని, భవిష్యత్తులో కోటికి పైగా ప్రవాసాంధ్రులు ప్రయాణాలు జరిపే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ కనెక్టివిటీని మరింత విస్తృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడ ప్రాంత ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థి సంఘాలు ఈ సర్వీసు పట్ల ఆసక్తిగా ఉన్న నేపథ్యంలో, వారి అభ్యర్థన మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించడంతో నూతన విమాన సర్వీసు ఏర్పాటుకు రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకున్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ సౌకర్యం తెలుగు ప్రవాస భారతీయులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వ్యాపార, సాంస్కృతిక బంధాలను మరింత బలపరుస్తుందని శ్రీ సాంస్కృతిక కళాసారధి సింగపూర్ అధ్యక్షుడు రత్నకుమార్ కవుటూరు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలుతెలియజేశారు.



# దేవుడు శరీరాన్ని త్యాగం చేస్తాడా?

**దేవుడికి మరణమా? అసలు ఉన్నాడో, లేడో అన్న వాదోపవాదాలు జరిగే దేవుడికి చావు ఉండటం ఏమిటి? మన వేదాల ప్రకారం పుట్టుకే లేని భగవంతునికి మృత్యువు ఎక్కడిది..? చావు పుట్టుకలకు అతీతమైన దేవుడు శరీరాన్ని త్యాగం చేస్తాడా? ఆ శరీరానికి అంత్యక్రియలు జరుగుతాయా? అదీ మనుషులు అంతిమ సంస్కారం చేస్తారా? ఇది వింతా? విచిత్రమా? విడ్డూరమా? లేక వాస్తవమా?**

## ఈ చెట్లకు కచ్చితమైన గుర్తులు కనిపించి తీరాలి..

1. జగన్నాథుడి విగ్రహం తయారు కావలసిన చెట్టు కాండంపై సుదర్శన చక్రం
2. బలభద్రుడి విగ్రహ తయారీకి వాడే చెట్టుపై గద గుర్తు
3. సుభద్ర విగ్రహం కోసం వినియోగించే చెట్టుపై కమలం గుర్తు
4. ఆ చెట్ల నీడలో విషపాములు కనిపించాలి
5. దగ్గరలో తప్పనిసరిగా ఓ చింత చెట్టు ఉండాలి.

అవును.. ఇది నిజం. ఈ భూమ్మీదే జరుగుతోంది. మన దేశంలోనే జరుగుతోంది. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన దేవుడికి జరుగుతున్న కార్యక్రమం ఇది. మనుషులే చేస్తున్న అద్భుతమైన సంస్కారం ఇది. ఎందుకిలా చేస్తారు? దేవుడికి పార్థివ శరీరం వుండటం ఎలా సాధ్యపడుతుంది? అంటే దేవుడు ఉన్నాడన్నది వాస్తవమేనా? విశ్వాసం కాదా? మన పురాణాల ప్రకారం దేవుడు నిరాకారుడు.. అంటే ఆకారం అంటూ లేని వాడు.. అందుకే మన వాళ్లు భూమిని కొలుస్తారు.. ఆకాశాన్ని కొలుస్తారు.. రాయి, రప్పను కొలుస్తారు.. పామును కొలుస్తారు.. గోవును కొలుస్తారు.. ఒక ఇటుకకు పసుపు కుంకుమ పెట్టి దాన్ని దేవతగా కొలుస్తారు.. దేనికీ ఆకారమే ఉండదు.. తమకు ఏ రూపం కావాలనుకుంటే ఆ రూపంలో దేవుళ్లను కొలుస్తారు. మరి ఓ స్పెసిఫిక్ ఆకారమే లేని దేవుడికి శరీరం మాత్రం ఎలా ఉంటుంది? అదే దేవ రహస్యం.. దేవుడికి రూపం అనేది ఓ పదార్థం. అంటే మెటీరియల్.. ఈ మెటీరియల్ లోపల ఉండే చైతన్యమే దైవత్వం అని మన గాఢ విశ్వాసం. సైన్స్ ఎప్పుడూ మెటీరియలిస్టిక్గా ఆలోచిస్తుంది..



**ఇదిగో ఈ దేవుడు ఆ మెటీరియల్ ఏమిటో మనకు చూపిస్తున్నాడు.. దాని రహస్యాన్ని వివరిస్తున్నాడు. మెటీరియల్లో చైతన్యం ఎలా వుంటుందో.. ఆ చైతన్యం లేనప్పుడు ఎలా నిర్జీవంగా మారుతుందో రుజువు చేస్తున్నాడు.. మనం బట్టల్ని మార్చినట్లు ఈ దేవుడు తరచూ తన శరీరాన్ని మార్చేస్తున్నాడు.. ఇది మన కళ్ల ముందు జరుగుతున్న ప్రక్రియ.. ప్రజలు పండుగలా చేసుకునే అద్భుతమైన కార్యక్రమం ఇది. పూరీ జగన్నాథుడు.. అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది రథయాత్ర. ప్రపంచంలో మరెక్కడా లేని అతి పెద్ద రథయాత్ర. లక్షలాది ప్రజలు అతి పెద్ద రథాలను లాగే అపురూప ఉత్సవం.. ప్రతి ఏడాది ప్రపంచంలోని లక్షలాది ప్రజలు వేయి కళ్లతో ఎదురు. చూసే వేడుక... కానీ, రథయాత్రను మించిన ఎన్నో ప్రత్యేకతలు మనకు ఇక్కడ కనిపిస్తాయి. అందులో ఒకటి జగన్నాథుడు తన శరీరాన్ని విడిచిపెట్టడం.**

పూరీలో జగన్నాథ రథచక్రాలు ప్రతి ఏటా కదులుతుంటాయి. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలు మూడు రథాలపై పూరీలో ఊరేగుతుంటారు... ఈ రథయాత్రను చూసేందుకే లక్షలాది ప్రజలు తరలి వస్తారు. రోజుల తరబడి వేచి చూస్తారు.. రథాన్ని లాగడానికి ఉత్సాహపడతారు. 3 కిలోమీటర్ల పొడవైన తాడును ఎన్ని వేల మంది లాగుతారో ఊహించుకుంటేనే ఒళ్లు పులకరిస్తుంది... మామూలుగా వివిధ ఆలయాల్లో దేవుళ్లకు రథోత్సవం జరుగుతుంది. కానీ, రథంలో ఊరేగే దేవుడు ఆయా దేవాలయాల్లోని ఉత్సవ మూర్తే. కానీ, పూరీలో సాక్షాత్తూ మూల విరాట్టే వీధిలోకి వచ్చి రథంపై కూర్చొని ఊరేగుతాడు.. ఇది విచిత్రం ఏం కాదు.. ఇక్కడి ప్రత్యేకతే అది.. గర్భగుడిలో ఉన్న మూల విరాట్టు మూర్తులను కదిలించి బయటకు తీసుకువచ్చి రథంపై కూర్చోబెట్టి పది రోజుల పాటు రథయాత్ర నిర్వహించటం ఇక్కడ మాత్రమే కనిపించే సంప్రదాయం. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర ఊరేగే రథాలు ఏ యేటికాయేడు కొత్తగా తయారు చేసేవే. ఒకసారి ఉపయోగించిన రథాన్ని మళ్లీ ఉపయోగించరు. పోనీ ఆ రథం మామూలుగా ఉంటుందా అంటే అదీ లేదు.. ఒక్క జగన్నాథుడి రథమే 45 అడుగుల ఎత్తు ఉంటుంది. ఏకంగా పదహారు రథచక్రాలు ఉంటాయి. ఇది సందఘోష రథం.



**- కోవెల సంతోష్ కుమార్**
**రచయిత**
**9052116463**

ఇక బలభద్రుడి రథం ఒక అడుగు తక్కువ ఉంటుంది. ఇది 14 రథచక్రాలతో నడుస్తుంది. మూడోరథం ఇంకో అడుగు తక్కువతో తయారు చేస్తారు... ఇవన్నీ పూర్తిగా కలపతో చేసినవే.. ప్రత్యేకంగా పెంచిన చెట్ల కలపను వాడి తయారు చేసినవే. ప్రతి ఏడూ కొత్త రథాన్ని తయారు చేయటం అంటే సామాన్యమైన విషయం కాదు.. అంత ఈజీ కూడా కాదు.. కానీ, పూరీలో మాత్రం ఇది సాధ్యమవుతోంది. వందల సంవత్సరాలుగా ఈ రథయాత్ర ఆగకుండా సాగుతోంది. రథయాత్ర పూర్తి కాగానే రథాల్ని పూర్తిగా ఏ భాగానికి ఆ భాగం విడగొడతారు.. మళ్లీ ఏడాది కాగానే కొత్త రథాలు తయారవుతాయి. పూరీలో ఇదొక్కటే విచిత్రం కాదు. ఇక్కడ జరిగే ప్రతి ఉత్సవం దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది.. ఇక్కడి జగన్నాథుడు మనలో ఒకరుగానే ఉన్నట్లుగా ఇక్కడి ఉత్సవాలు జరుగుతాయి. ప్రపంచంలో పూరీలోని ఆలయమే ఒక విచిత్రమైన ఆలయం. సాధారణంగా ఆలయాల్లో లక్ష్మీ నారాయణులో, సీతారాములో, శ్రీనివాస పద్మావతులో, శివ పార్వతులో ఇలా జంటలుగానే దేవతామూర్తులు కనిపిస్తారు. కానీ, పూరీలో అన్నా చెల్లెళ్లు ఉంటారు. శ్రీకృష్ణుడు, బలరాముడు, వాళ్ల చెల్లెలు సుభద్రలు ఇక్కడ ప్రధాన దేవతలు. ఈ మూల విగ్రహాలను సైతం కలపతోనే తయారు చేస్తారు.

ఇక్కడ ఇంకో విచిత్రమూ ఉంది.. ఇక్కడ కనిపించే జగన్నాథ స్వామి మొండి చేతుల వాడు.. ఈ మూర్తికి చేతులు పూర్తిగా ఉండవు. ఈ విగ్రహాన్ని తొలిసారి విశ్వకర్మ రూపొందిస్తున్నప్పుడు ఒరిస్సా రాజు ఇంద్రద్యుమ్నుడు ఆటంకం కలిగించటం వల్ల విగ్రహం పూర్తి కాకుండానే విశ్వకర్మ వెళ్లిపోయాడట.. అప్పటి నుంచీ జగన్నాథ స్వామి మొండి చేతుల వాడిగానే భక్తులకు దర్శనమిస్తున్నాడు. స్వామి వారి విగ్రహమైనా సాధారణంగా ఉంటుందా అంటే అదీ ప్రత్యేకమైన పద్ధతిలో ఉంటుంది.. పెద్ద పెద్ద గుండని కళ్లు జగన్నాథుడికి ఉంటే, బలభద్రుడికేమో ఓవెల్షిప్ కళ్లు ఉంటాయి. వీటికి కింది నుంచే కాస్తంత ఉన్న మొండి చేతులు ఉంటాయి. విగ్రహాన్ని చూడగానే ప్రత్యేక ఆసక్తి కలుగుతుంది. వీటిని ఓ ప్రత్యేకమైన కలపతో తయారుచేస్తారు.. వీటికి ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. అలాంటి విగ్రహాలకు కాలనుగుణంగా కొన్ని నియమిత సంవత్సరాలకు అంతిమ సంస్కారం జరగటం వెనుక పెద్ద రహస్యమే దాగి ఉంది.. అదే పూరీలోని పరమ అద్భుతమైన విశేషం. ఇంతటి విశిష్టత కలిగిన జగద్గురువుకు అంతిమ సంస్కారం చేయటం ఏమిటి? దీని పేరు నవకళేవర ఉత్సవం అంటారు. ఇలాంటి విశేషమైన ఉత్సవం అన్నది ప్రపంచంలో పూరీలో తప్ప మరెక్కడా జరగదు.. ఇది అంతిమసంస్కారం కాదు.. కొత్త శరీరంలోకి భగవంతుడు మారటమే ఇది.. జగన్నాథుడు పాత శరీరాన్ని విడిచిపెట్టి కొత్త శరీరంలోకి ప్రవేశిస్తాడు.. అదే పూరీలో జరిగే నవ కళేవర ఉత్సవం. మనం మాసిన బట్టలను వదిలేసి ఉతికిన బట్టలను రోజూ మార్చుకుంటాం.. పూరీలో జగన్నాథుడు పాత శరీరాన్ని విడిచిపెట్టి, సరికొత్త శరీరాన్ని ధరిస్తాడు.. దీన్ని నవ కళేవర ఉత్సవంగా పిలుస్తారు.. ఇది దాదాపు రెండు మాసాల పాటు సాగే అతి పెద్ద కార్యక్రమం. ఖగోళ శాస్త్రం పద్ధతులను అనుసరించి ప్రతి 8, 11, 19 సంవత్సరాలకు ఒకసారి పూరీ జగన్నాథుడికి నవ కళేవర ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇది అంత ఈజీగా జరిగే తంతు కాదు. మూల విగ్రహాల స్థానంలో కొత్త విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించటం.. ఇందుకోసం చాలా పెద్ద కసరత్తే చేస్తారు. విగ్రహాల తయారీ అత్యంత రహస్యంగా నిర్వహిస్తారు. నవ కళేవర ఉత్సవాలు ప్రారంభం కాగానే ఆలయ ప్రధానార్చక కుటుంబీకులు వారికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కకటూర్కు వెళ్తారు. అక్కడ పాచీ నదిలో స్నానం చేసి పక్కనే ఉన్న మంగళాదేవి ఆలయంలోకి వెళ్లి అక్కడే నిద్రిస్తారు. అమ్మవారు వారి కలలో కనిపించి జగన్నాథ స్వామి వారి విగ్రహానికి కావలసిన చెట్టు ఎక్కడుందో చెప్తుంది. పూజారులు అక్కడి నుంచి అమ్మవారు చెప్పిన దిశలో కాలినడకన బయలుదేరి వెళ్తారు.. కొన్ని ప్రత్యేకతలు కలిగిన వేప వృక్షాలను కనుగొంటారు.



విగ్రహాల తయారీకి ఉపయోగించే చెట్టు కాండం నిటారుగా పది నుంచి పన్నెండు అడుగుల ఎత్తుకు ఎదిగి ఉండాలి. కాండం నాలుగు నుంచి ఏడు భాగాలుగా విస్తరించి వుండాలి. చెట్లకు సమీపంలో ఒక స్మశానం, నీటి వనరు, శివాలయం ఉండి తీరాలి. ఇన్ని రకాలుగా అన్నీ కుదిరిన తరువాత ఎంపిక చేసుకున్న చెట్లకు పూజారులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆ చెట్లను కొట్టేస్తారు.. వాటిని చెక్కతో తయారు చేసిన బండ్లపై ఎక్కించి పూరీ ఆలయానికి తీసుకువస్తారు.. ఉత్తర ద్వారం గుండా వాటిని ఆలయంలోకి తీసుకెళ్లి కోయిల్ వైకుంఠం ప్రాంగణంలో వుంచుతారు. అక్కడే విగ్రహాల తయారీ జరుగుతుంది. ఇది అత్యంత రహస్యంగా జరుగుతుంది.. సదరు శిల్పికి తప్ప ఎవరికీ అనుమతి ఉండదు. చైత్ర మాసంలో మొదలయి, సరిగ్గా ఆషాఢశుద్ధ చతుర్థి నాటికి విగ్రహాల తయారీ పూర్తవుతుంది. అదే రోజు రాత్రి బ్రహ్మ ముహూర్తంలో పాత విగ్రహాల లోపల ప్రాణ ప్రతిష్ఠ చేసి ఉన్న బ్రహ్మ పదార్థాన్ని ప్రధాన పూజారి కొత్త విగ్రహాల్లోకి మారుస్తారు. దీంతో కొత్త విగ్రహాలకు చైతన్యం వస్తుంది. ఈ పదార్థాన్ని ఆ ముగ్గురు దేవతల అస్థికలని కొందరంటారు.. మరి కొందరు సాలగ్రామాలని పిలుస్తారు.. బౌద్ధులు బుద్ధుడి పన్ను అంటారు.. శ్రీకృష్ణుడి నిర్యాణానంతరం ఆయన అస్థికను ఈ విగ్రహాల్లో ఉంచారట.. అలాగే సముద్రంలో శరీర త్యాగం చేసిన బలరాముడు, సుభద్రల అస్థికలనూ ఇందులో ఉంచారట.. వీటిని మారుస్తున్నప్పుడు పూజారి సైతం కళ్లకు గంతలు కట్టుకుంటారు.. కొత్త విగ్రహాల్లో ప్రాణపతిష్ఠ చేసిన తరువాత పాత విగ్రహాలను అత్యంత శాస్త్రోక్తంగా గుడిలోనే కోయిల్ వైకుంఠం అన్న ప్రాంగణంలో ఖననం చేస్తారు.. ఇక్కడ స్వామి తన పాత శరీరాన్ని విడిచి కొత్త శరీరంలోకి ప్రవేశించాడు.. ఇది దేవుడికి మరణం కాదు.. జీవుడు తన దేహాన్ని మార్చుకోవటమే ఈ నవకళేవరలోని ప్రధాన అంశం. ఇప్పటి వరకు 17సార్లు పూరీలో నవ కళేవర కార్యక్రమం జరిగింది. చివరి సారి 1996లో జరిగింది. రథయాత్ర కంటే ఈ కార్యక్రమానికి లెక్కించలేనంత మంది భక్తులు హాజరవుతారు. శరీరంలో జీవుడు ప్రవేశించి, ఆ తరువాత బయటకు వచ్చి మరో శరీరంలో ఎలా ప్రవేశిస్తాడో.. జగద్గురువు ఇక్కడ బోధిస్తున్నాడు.. పునరపి జననం.. పునరపి మరణంలోని రహస్యార్థం ఇదే. ఆయన రథంపై స్థిరంగా కూర్చుని తిరగడం కూడా ఇలాంటిదే.. జీవుడిలోపల గూడు కట్టుకుని ఉండిపోయి, అతనికి మార్గదర్శనం చేస్తున్నాడు.. రాముడు తాను చేసి చూపించాడు.. కృష్ణుడు చెప్పి చేయించాడు.. అందుకే ఈయన జగద్గురువు అయ్యాడు.. పూరీలో ఆయన చూపించింది. చూపిస్తున్నదీ అంతా జీవ రహస్యమే. కృష్ణం వందే జగద్గురుమ్..!

## వయ్యారి చిత్రం







# ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్

రెబల్ స్టార్ ఫ్యాన్స్ అందరికీ మెంటల్ ఎక్కించే ఒక న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రాజాసాబ్, ఫౌజీతో పాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ సినిమాలు వరుసగా చేయాల్సి ఉంది. అయితే, మరో సినిమాకు ప్రభాస్ ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ కూడా ప్రభాస్ తో సినిమా చేస్తాడని అంటున్నారు. ఇంకో షాకింగ్ న్యూస్ ఏంటంటే.. ప్రస్తుతం ఫౌజీ సినిమా డైరెక్టర్ హను రాఘవపూడితో ఇంకో సినిమా చేసేందుకు ప్రభాస్ సిద్ధంగా ఉన్నాడట. హను వర్క్‌కి ప్రభాస్ ఇంప్రెస్ అయ్యి.. అతనితోనే మరో సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నాడట. ఆ సినిమాను హోంబలే ఫిలిం నిర్మించనున్నట్లు సమాచారం.

# రకుల్‌కు కెరీర్ బెంగ

నటి రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం అజయ్ దేవగన్ తో నటించిన దే దే ప్యార్ దే -2 మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ మూవీ దే దే ప్యార్ దే సినిమాకి సీక్వెల్ గా తెరకెక్కుతోంది. ఈ సినిమా రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ని డిసైడ్ చేసుకునే చివరి చాన్స్ అని చెప్పుకోవచ్చు. గత 6 సంవత్సరాల నుండి రకుల్ ప్రీత్ సింగ్ నటించిన ఏ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద హిట్ కావడం లేదు. ఈమె చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవుతున్నాయి. అటు టాలీవుడ్ ఇటు బాలీవుడ్ లో వరుస సినిమాలు డిజాస్టర్ గా నిలుస్తున్నాయి. దాంతో రకుల్ ప్రీత్ సింగ్ కి అవకాశాలు కూడా రావడం లేదు. అందుకే రకుల్ కెరియర్ ని డిసైడ్ చేసే సినిమాగా దే దే ప్యార్ దే-2 సినిమాని చెప్పుకోవచ్చు. ఈ సినిమా హిట్ అయితే ఆమెకు ఇండస్ట్రీలో అవకాశాలు వస్తాయి. ఒకవేళ ఫ్లాప్ అయితే మాత్రం ఇక రకుల్ ప్రీత్ సింగ్ కెరియర్ ఇండస్ట్రీలో క్లోజ్ అయినట్టే.





# రియలైజ్ అయిన రాశీఖన్నా!

సిచువేషన్ డిమాండ్ చేస్తే ఎవరైనా ఎలాంటి పాత్రలలోనైనా చేయాల్సి వస్తుంది. కానీ కొంతమంది అలాంటి పాత్రలు చేయము.. ఇలాంటి కథలు మాకు సెట్ కావు అంటూ భీష్మించుకు కూర్చుంటారు. అయితే అలా పట్టుబడితే ఇండస్ట్రీలో అవకాశాలు రావని, పాత్రకు తగ్గట్టుగా మనల్ని మనం మార్చుకోవాలి అని ప్రముఖ యంగ్ బ్యూటీ ,స్టార్ హీరోయిన్ రాశి ఖన్నా స్పష్టం చేసింది. ముఖ్యంగా ఈమె చెబుతున్న మాటలు వింటే మాత్రం నిజంగానే ఈమె రియలైజ్ అయ్యిందా? అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతోంది? అనే అనుమానాలు కలగకమానదు. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోతేనే ఇండస్ట్రీలో కొంతకాలం కొనసాగుతాము అంటూ ఇండైరెక్టుగా కామెంట్లు చేసింది రాశీఖన్నా. ఈమె కామెంట్లు విన్న నెటిజన్స్.. రాశీ ఖన్నా రియలైజ్ అయ్యిందంటూ కామెంట్లు చేస్తున్నారు.

# లిటిల్ హార్ట్స్ డైరెక్టర్‌తో నితిన్!



లిటిల్ హార్ట్స్ డైరెక్టర్ సాయి మార్తాండ్.. లవర్ బాయ్ నితిన్‌కి ఒక కథ వినిపించాడట. లిటిల్ హార్ట్స్ తరహాలో కామెడీ ఎంటర్టైనర్‌గా, నితిన్‌కు తగ్గట్లు కథ రాసుకున్నాడట సాయి మార్తాండ్. అసలే వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న నితిన్.. అర్జెంట్ హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. దీంతో లిటిల్ హార్ట్స్ డైరెక్టర్ సాయి మార్తాండ్‌తో నితిన్ కలిస్తే తప్పకుండా ఆడియన్స్‌కి మరో రీఫ్రెషింగ్ కాంబో సెట్ అయినట్టే అవుతుంది.

# నా విలువలకు విరుద్ధం: జావెద్ అక్తర్



ప్రముఖ స్క్రీన్ రైటర్, లిరిసిస్ట్ జావేద్ అక్తర్ ఇండియాలోని సమాజ వాస్తవికతను ప్రతిబింబించే సినిమాలు నియంత్రణ సంస్థల నుంచి అడ్డంకులను ఎదుర్కొంటున్నాయని తన నిరాశను వ్యక్తం చేశారు. రీసెంట్ గా ఓ కార్యక్రమానికి హాజరైన అక్తర్, ఒక చెడ్డ సినిమాను సక్సెస్‌ఫుల్ గా మార్చేది చెడు ఆడియన్సేనని అన్నారు. మన దేశంలో వల్గారిటీ ఇప్పటికి కూడా విస్మరించబడుతుందని అభిప్రాయపడ్డారు. దాని వల్లే తప్పుడు విలువలు, ఆడవాళ్లను అవమానించే దృక్పథం ఎక్కువ అవుతుందని, సమాజంలో జరుగుతుంది ఇదేనని చెప్పారు. సినిమాలు రియాలిటీని చూపించడానికి మాత్రమే ప్రయత్నిస్తాయని చెప్పిన ఆయన, అనంతరంగ్ మెంటల్ హెల్త్ కల్చరల్ ఫెస్టివల్ ప్రారంభ సమావేశంలో సినిమాల్లో చూపించే విషయాలు మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని అన్నారు. పురుషులు మానసిక ఆరోగ్యం వల్లే అలాంటి సినిమాలు తీస్తున్నారని, వారి మెంటల్ హెల్త్ బాగుపడితే, అలాంటి సినిమాలు తీయరని, ఒకవేళ తీసినా ఆ సినిమాలు వర్కవుట్ అవ్వవని అన్నారు. సినిమాల్లో వల్గారిటీ ఉన్న పాటల్ని పెట్టడంపైనా అక్తర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాంటి ఆఫర్లను తాను చాలా రిజెక్ట్ చేశానని, ఎందుకంటే అవి తన విలువలకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు.

# ఎల్లమ్మ నుంచి నితిన్ ఔట్..!

డైరెక్టర్‌గా వేణు యెల్దండికి భారీ పేరు తీసుకొచ్చిన చిత్రం బలగం. ఆ సూపర్ హిట్ మూవీ తర్వాత ఆయన తెరకెక్కించబోయే కొత్త సినిమా 'ఎల్లమ్మ' పై గత కొంత కాలంగా టాలీవుడ్‌లో భారీ క్రేజ్ నెలకొంది. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ అధికారికంగా సెట్స్‌పైకి వెళ్లకపోవడం, హీరోయిన్, హీరో ఎంపికపై ఊహాగానాలు చక్కర్లు కొట్టడం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మించనున్నారు. మొదట్లో 'ఎల్లమ్మ' సినిమాలో యంగ్ హీరో నితిన్ హీరోగా నటించనున్నారని ప్రచారం జరిగింది. దిల్ రాజు స్వయంగా ఒక కార్యక్రమంలో ఇది వెల్లడించారు. అంతేకాదు, నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా రిలీజ్ అయిన తర్వాతే ఈ ప్రాజెక్ట్ మొదలవుతుందని ప్రకటించారు. అయితే ఇటీవల నితిన్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో 'ఎల్లమ్మ' లో హీరోగా మరొకరిని తీసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని టాక్. నితిన్ స్థానంలో మొదటగా శర్వానంద్ పేరు వినిపించింది. కథ వినిపించగా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కూడా ప్రచారం జరిగింది. కానీ తాజాగా సోషల్ మీడియాలో కొత్త పేరు హల్‌చల్ చేస్తోంది. అది ఎవరో కాదు ఇటీవల 'కిష్కింధపురి' సినిమాతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఇప్పటికే నిర్మాతలు బెల్లంకొండతో చర్చలు జరుపుతున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.








# విండీస్ ఫాలోఆన్.. కానీ!

**248 పరుగులకు కరేబియన్ జట్టు ఆలౌట్**

**ఫాల్ ఆన్ ఆడించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్**

**రెండో ఇన్నింగ్స్‌లో ధీటుగా విండీస్ ఆట**

**173/2.. 97 పరుగుల వెనుకంజ**

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసేసరికి పరిస్థితి ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో 518 పరుగుల భారీ స్కోరు చేసిన భారత జట్టు, వెస్టిండీస్‌ను 248 పరుగులకే ఆలౌట్ చేసింది. దీనితో భారత్‌కు 270 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.

కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ నిర్ణయం మేరకు వెస్టిండీస్‌కు ఫాలోఆన్ ఇవ్వబడింది. అయితే ఫాలోఆన్‌లో బరిలోకి దిగిన విండీస్ టీమ్, భారత బౌలింగ్‌కు గట్టి జవాబిచ్చింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి, వెస్టిండీస్ 2 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ప్రస్తుతం విండీస్ భారత్ కంటే కేవలం 97 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది.

దీంతో మ్యాచ్ నాలుగో రోజుకు చేరింది. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ పోరాటానికి ముందు తొలి ఇన్నింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ తన స్పిన్ మ్యాజిక్‌తో వెస్టిండీస్ ఇన్నింగ్స్‌ను కూల్చడంలో కీలకపాత్ర పోషించాడు. కుల్దీప్ అద్భుతంగా రాణించి 5 వికెట్ల హాల్ సాధించాడు. వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 4 వికెట్లకు 140 పరుగుల నుంచి ప్రారంభించగా, ఆట మొదలైన అరగంటలోనే కుల్దీప్ తన స్పెల్ మొదలుపెట్టి షాయ్ హెూప్‌ను (36) అద్భుతమైన బంతితో బౌల్డ్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. కుల్దీప్ ఆ తర్వాత టెవిన్ ఇంలాచ్ (21), జస్టిన్ గ్రీవ్స్ (17), ఆఖరి వికెట్‌గా జైడెన్ సీల్స్‌ను అవుట్ చేసి టెస్ట్ కెరీర్‌లో 5వ సారి 5 వికెట్ల హాల్ పూర్తి చేసుకున్నాడు. మహమ్మద్ సిరాజ్ జోమెల్ వారికన్‌ను ఔట్ చేయగా.. బుమ్రా ఖారీ పియరీని అవుట్ చేశాడు. పియరీ (23), అండర్సన్ ఫిలిప్ (24 నాటౌట్) కలిసి 9వ వికెట్‌కు 46 పరుగులు జోడించి విండీస్ ఇన్నింగ్స్‌ను కొంతవరకు పొడిగించారు. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగుల భారీ లోటుతో ఫాలోఆన్ ఆడిన వెస్టిండీస్.. రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసింది. టీ సమయానికి విండీస్ 2 వికెట్లకు 35 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. మహ్మద్ సిరాజ్ వేసిన షార్ట్ బాల్‌కు తేజ్‌నారాయణ్ చంద్రపాల్ (10) పుల్ షాట్‌కు యత్నించి, శుభ్‌మన్ గిల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అలాగే, ఎలిక్ అతానాజేను (7) వాషింగ్టన్ సుందర్ అద్భుతమైన ఆఫ్-స్పిన్‌తో బోల్తా కొట్టించాడు. అయితే ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు భారత బౌలర్లను నిలువరించారు. దీంతో ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ స్కోరు 173/2 కి చేరి, భారత్‌కు గట్టి సమాధానం ఇచ్చింది. భారత్ కేవలం 97 పరుగుల ఆధిక్యంలో ఉండగా, నాలుగో రోజు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించే కీలక రోజు కానుంది.



## కుల్దీప్.. 64 ఏళ్ల ప్రపంచ రికార్డు సమం

వెస్టిండీస్ తో రెండో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ 26.5 ఓవర్లలో 82 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఇది కుల్దీప్ టెస్ట్ కెరీర్‌లో 5వసారి 5 వికెట్ల హాల్ కావడం విశేషం. ఈ ప్రదర్శనతో కుల్దీప్ టెస్ట్ క్రికెట్‌లో అత్యధికంగా 5 వికెట్ల హాల్ సాధించిన ఎడమచేతి వాటం రిస్ట్ స్పిన్నర్‌గా 64 ఏళ్ల రికార్డును సమం చేశాడు. అంతకుముందు ఈ రికార్డు జానీ వార్డ్‌లే పేరిట ఉంది. జానీ వార్డ్‌లే తన కెరీర్‌లో ఈ ఘనతను 5 సార్లు సాధించాడు. అయితే అతను దీనిని 28 టెస్ట్ మ్యాచ్‌లలో పూర్తి చేశాడు. కానీ కుల్దీప్ యాదవ్ కేవలం 15 టెస్ట్ మ్యాచ్‌లలోనే ఈ మైలురాయిని చేరుకోవడం గమనార్హం. జానీ వార్డ్‌లే 1964లో ఈ రికార్డును నెలకొల్పగా.. ఇప్పుడు కుల్దీప్ యాదవ్ దానిని సమం చేశాడు.




## స్మృతి మంధాన సరికొత్త చరిత్ర

మహిళా క్రికెట్ లో అత్యంత అసాధారణమైనదిగా పరిగణించబడే ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000 పరుగులు పూర్తి చేసిన మొట్టమొదటి క్రీడాకారిణిగా స్మృతి మంధాన నిలిచింది. మహిళా వన్డే ప్రపంచ కప్ 2025లో కొన్ని మ్యాచ్‌లలో (వరుసగా మూడు) నిరాశపరిచినప్పటికీ, ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆమె తన పరుగుల వేటను కొనసాగించింది. స్మృతిమంధాన 54 బంతుల్లో 62 పరుగులతో బ్యాటింగ్ చేస్తూ ఈ మైలురాయిని చేరుకుంది. తాజా గణాంకాల ప్రకారం, మంధాన ఈ సంవత్సరంలో కేవలం 18 మ్యాచ్‌లలోనే 1031 పరుగులు సాధించడం విశేషం. పరుగుల స్థిరత్వం, వేగానికి ఇది నిదర్శనం. ఈ మ్యాచ్ లో స్మృతి మంధాన 66 బంతుల్లో 80 పరుగులు చేసి ఔట్ అయింది. ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇంతకుముందు ఆస్ట్రేలియాకు చెందిన బి.జె. క్లార్క్ పేరిట ఉండేది. ఆమె 1997లో 16 మ్యాచ్‌లలో 970 పరుగులు సాధించింది. స్మృతి మంధాన సుమారు మూడు దశాబ్దాల నాటి ఈ రికార్డును కేవలం 18 మ్యాచ్‌లలోనే బద్దలు కొట్టింది. ఈ విధంగా, తన ఫామ్ మరియు పరుగుల దాహంతో స్మృతి మంధాన, 52 ఏళ్ల చరిత్రలో ఎవరూ సాధించని ఒక కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. ఇది భారత మహిళా క్రికెట్‌కు మాత్రమే కాకుండా, ప్రపంచ క్రికెట్‌కు కూడా ఒక గొప్ప మైలురాయి.

## సాయి సుదర్శన్ గాయంపై బీసీసీఐ క్లారిటీ



వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గాయపడిన టీమిండియా యువ క్రికెటర్ సాయి సుదర్శన్ ఆరోగ్యంపై బీసీసీఐ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఫ్యాన్స్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సుదర్శన్ గాయం తీవ్రమైనది కాదని బోర్డు స్పష్టం చేసింది. రెండో రోజు విండీస్ ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ కొట్టిన బంతిని అద్భుతమైన ఫీల్డింగ్‌తో క్యాచ్ పట్టుకొని పెవిలియన్ బాట పట్టించాడు సాయి సుదర్శన్. అయితే ఆ సమయంలో చేతికి బలమైన దెబ్బ తగిలింది. దాంతో బాధను తట్టుకోలేక మైదానాన్ని వదిలి వెళ్లిన సాయి స్థానంలో దేవదూత్ పడిక్కల్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా ఆడారు. అయితే అప్పటి నుండి సాయి సుదర్శన్ గాయంపై అభిమానులు ఆందోళన చెందుతూనే ఉన్నారు. ఈ క్రమంలో సాయి సుదర్శన్ గాయం గురించి స్పందించిన బీసీసీఐ ..“అతడి గాయం తీవ్రమైనది కాదు. ప్రస్తుతం బాగానే ఉన్నాడు. మా మెడికల్ టీమ్ అతడి ఆరోగ్య పరిస్థితిని నిత్యం పర్యవేక్షిస్తోంది.

# మహిళలకు మరో షాక్

**విశాఖలో భారత్‌కు వరుసగా రెండో ఓటమి**

**ఆసీస్ బ్యాటర్ హేలీ విధ్వంసక సెంచరీ**

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత జట్టుకు మరోషాక్. విశాఖపట్టణంలో వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓపెనర్ల మెరుపులతో టీమిండియా భారీ స్కోర్ చేసినా.. ఎలీసా హెలీ(142) సెంచరీతో చెలరేగి లక్ష్యాన్ని కరిగించింది. ఆమెకు ఎలీసా పెర్రీ(47 నాటౌట్), గార్డ్‌నర్ (45)లు తోడవ్వా ఆస్ట్రేలియా వన్డే చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదనతో ఆసీస్ జట్టు రికార్డు నెలకొల్పింది. స్నేహ్ రానా ఓవర్లలో పెర్రీ సిక్సర్‌తో కంగారూ టీమ్‌కు చిరస్మరణీయ విక్టరీని అందించింది. సొంతగడ్డపై జరుగుతన్న వరల్డ్ కప్‌లో టీమిండియాకు మరో భంగపాటు. దక్షిణాఫ్రికా చేతిలో చేజారిన ఓటమిని మరువక ముందే ఆస్ట్రేలియా దెబ్బకు మరో పరాజయం ఎదురైంది. వన్డేల్లో భారీ ఛేదనకు దిగిన ఆసీస్‌కు కెప్టెన్ ఎలీసా హేలీ (142) శతకంతో గట్టి పునాది వేసింది. పవర్ ప్లే తర్వాత డేంజరస్ ఓపెనర్ ఫొబె లిచ్‌ఫీల్డ్ (40)ను ఔట్ చేసిన శ్రీచరణి ఈసారి అనాబెల్ సథర్‌లాండ్‌ను క్లీన్ బౌల్డ్ చేసింది. దాంతో.. వరుస ఓవర్లలో రెండో వికెట్ కోల్పోయింది. అంతకుముందు దీప్తి శర్మ ఓవర్లో మిడాన్ దిశగా షాట్ ఆడిన బేత్ మూనీ(4)ని డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపింది జెమీమా. బంతిని గమనించిన జెమీమా ఎడమవైపు డైవ్ చేస్తూ రెండుచేతుల్తో క్యాచ్ అందుకుంది. దాంతో, 68 వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే శ్రీచరణి వికెట్ తీయడంతో ఆసీస్ ఒత్తిడిలో పడింది. వికెట్లు పడుతున్నా హేలీ మాత్రం జోరు తగ్గించలేదు. సెంచరీ తర్వాత మరింత దంచేసిన ఆమె 38వ ఓవర్ ఐదో బంతికి కవర్స్‌లో షాట్ ఆడింది. అక్కడే కాచుకొని ఉన్న స్నేహ్ రానా ముందుకు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో ఒడుపుగా క్యాచ్ అందుకుంది. రీప్లేలోనూ ఫేర్ క్యాచ్ అని తేలడంతో ఆసీస్ కెప్టెన్ నిరాశగా పెవిలియను చేరింది. కీలక వికెట్ తీసిన చరణి.. 96 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యాన్ని ముగించింది. 39 ఓవర్లకు కంగారూ టీమ్ స్కోర్ 265–4. ఇంకా విజయానికి 65 రన్స్ కావాలంతే. తహ్లియా మెక్‌గ్రాత్‌ను దీప్తి ఎల్బీగా ఔట్ చేయగా టీమిండియా రేసులోకి వచ్చింది. గార్డ్‌నర్‌ను అమన్‌జోత్ బౌల్డ్ చేయగా ఆరో వికెట్ పడడంతో సమీకరణం 30 బంతుల్లో 35కు చేరింది. కానీ, ఎలీసా పెర్రీ(47 నాటౌట్).. కిమ్ గార్త్ (14)లు క్రాంతి వేసిన 47వ ఓవర్లో చెరొక ఫోర్ బాదారు. పెర్రీ సిక్సర్‌తో జట్టుకు మూడు వికెట్ల విజయాన్ని అందించింది. దాంతో.. టీమిండియాకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. అంతకుముందు భారత జట్టు భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (80), ప్రతీకా రావల్ (75) దంచికొట్టడంతో ఆస్ట్రేలియాకు సవాల్ విసిరే లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి వికెట్‌కు వీరిద్దరూ 155 రన్స్ జోడించి బలమైన పునాది వేశారు. ఆ తర్వాత జెమీమా రోడ్రిగ్స్ (33), రీచా ఘోష్ (32)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో స్కోర్ 300 దాటించారు. అప్పటికి చేతిలో ఆరు వికెట్లు ఉండడంతో స్కోర్ 350 దాటడం ఖాయమనిపించింది. కానీ, టెయిలెండర్లు అనవసర షాట్లకు యత్నించి చకచకా పెవిలియన్ చేరారు. 49వ ఓవర్లో క్రాంతి గౌడ్ వికెట్ తీసిన సథర్‌లాండ్ ఆ తర్వాతి బంతికే శ్రీచరణిని క్లీన్ బౌల్డ్ చేయడంతో 330 వద్ద టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది.



# బీసీల్లారా..



# గెట్ రెడీ!

బీసీలు మరో తెలంగాణ ఉద్యమానికి సిద్ధం కావాలి. తెలంగాణ రాష్ట్రంలో గత 20 నెలల క్రితం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం కావడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంట్లు ఆగిపోయాయి, గ్రామపంచాయతీలు ఆర్థిక ఇబ్బందులతో అనేక సమస్యలతో, గ్రామాభివృద్ధి కుంటుపడిపోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారంగా, రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వాగ్దానం చేసిన మేరకు 42% రిజర్వేషన్ అమలుకు సెప్టెంబర్ 26 న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 9 అమలును రాష్ట్ర హైకోర్టు మధ్యంతర స్టే విధించడంతో,తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆగిపోయి, ఒక అడుగు ముందుకు, నాలుగడుగులు వెనక్కిగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నం సందిగ్ధంగా కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ చేసింది గాని సఫలం కాలేకపోయింది.



కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 2025లో రాష్ట్రంలో బీసీ ప్రజలకు 42% రిజర్వేషన్స్ విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో కల్పించడానికి సంబంధించిన రెండు బిల్లులను శాసనసభ ఆమోదింప చేసి రాష్ట్ర గవర్నర్ కు పంపగా,ఇట్టి బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్లో ఉంచబడినవి. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్స్ అమలు సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ పరిమితికి సంబంధించినది కావున ఇట్టి బిల్లుల రాష్ట్రపతి ఆమోదం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంఘాలతో కలిసి ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి బదులుగా, తెలంగాణ రాష్ట్రంలోని బీజేపీ పార్టీ 8 గురు ఎంపీలు ఒక రాజ్యసభ సభ్యుడితో, దేశంలోని 238 ఓబీసీ ఎంపీల మద్దతు కూడగట్టి, ప్రధానమంత్రిని కలిసే కార్యక్రమం చేపట్టవలసి ఉండాల్సింది. కానీ అది జరగలేదు, కాంగ్రెస్ ప్రభుత్వం 42% రిజర్వేషన్ అమలుకై కుల సర్వే నిర్వహించి జనాభా వివరాలు ఉన్నప్పటికీ, ప్రత్యేక డెడికేషన్ కమిషన్ నియమించినప్పటికీ, 2018 పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి 50% పరిమితిని తొలగించిన బిల్లు గవర్నర్ ఆమోదం చేయనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 26న జీవో 9 ని విడుదలచేసి ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ ప్రకటించినప్పటికీ, ఇట్టి జీవో 9 తొ పాటు 41,42 జీవోలను కూడా అమలును రాష్ట్ర హైకోర్టు అక్టోబర్ 9న తాత్కాలికంగా నిలిపివేసింది.

ఈ నెల 10న హైకోర్టు వెలువరించిన పూర్తి ఉత్తర్వులలో ఎన్నికల కమిషన్ ప్రకటించిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను నిలుపుదల చేయలేదని, పాత రిజర్వేషన్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించుకోవచ్చు అని స్పష్టం చేసింది, కేవలం రాష్ట్ర ప్రభుత్వం బీసీల 42% రిజర్వేషన్ కోసం విడుదల చేసినటువంటి జీవో 9, 41,42 లు సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ చట్రాన్ని ఉల్లంఘించావని, మొత్తం 50% రిజర్వేషన్ పరిమితిని దాటిందని ఇట్టి జీవోల అమలును నిలుపుదల చేశామని స్పష్టం చేసింది.

రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల న్యాయ సంక్లిష్టతలను దృష్టిలో ఉంచుకొని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం తాత్కాలిక ఉపశమనం కోసం కాకుండా,కేవలం బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ కే కాకుండా, ప్రధాన అడ్డంకిగా ఉన్న 50% రిజర్వేషన్ పరిమితిని అధికమించి చట్టబద్ధంగా విద్యా,ఉద్యోగాలలో, చట్టసభలలో రిజర్వేషన్ కోసం, రాజ్యాంగ సవరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రిని కలవాల్సిన అవసరం ఉంది.

## ఓటు బ్యాంకుగానే బీసీలు

బీసీ ప్రజల 42% రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బీసీల ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాకుండా, మొసలి కన్నీరు కార్చకుండా,ఒక పార్టీ తప్పిదాన్ని, మరొక పార్టీ విమర్శించడం కాకుండా సమాజ సమగ్రాభివృద్ధి కోసం బీసీల 42% రిజర్వేషన్ కోసం చిత్తశుద్ధితో కృషి చేయవలసిన అవసరం ఉంది ప్రస్తుత లోక్ సభలో అన్ని పార్టీల నుంచి 238 గురు ఓబీసీ ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ బీసీ ప్రజల 42%రిజర్వేషన్స్ ను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రాష్ట్రపతి ఆమోదం సాధించలేకపోయారు. తమిళనాడులో మొత్తం రిజర్వేషన్ 69% ఎలా సాధ్యమైందో ఈ పార్టీల నాయకులకు తెలియని విషయం కాదు, తమిళనాడు తరహా మాదిరి 1993లో ఆనాటి ముఖ్యమంత్రి జయలలిత గారు అన్ని పార్టీలను ఐక్యంచేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, బీసీలకు 50% రిజర్వేషన్స్ ను మొత్తం రిజర్వేషన్స్ ను 69% సాధించి 45,1994 యాక్టను రూపొందించి రాష్ట్రపతిచే ఆమోదింపజేసి రాజ్యాంగ సవరణతో 9 షెడ్యూల్లో చేర్చడం జరిగింది. బీసీల 42% రిజర్వేషన్ విషయమై తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు శుద్ధమైన శాఖాహారులే, కానీ బీసీల కోడి మాయమైపోయింది, ఇలా ఉంది నేడు మన రాష్ట్రంలోని పార్టీల పరిస్థితి.

ఇక గత తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత బీసీల 42% రిజర్వేషన్ పై గొంతు చించుకొని వాదిస్తున్నారు,గత వారి ప్రభుత్వ హయాంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 20 ఏళ్లుగా అమలైన 34% రిజర్వేషన్ ను 23% నికి తగ్గించినప్పుడు, అదేవిధంగా 2018 పంచాయతీ రాజ్ చట్టంలో మొత్తం రిజర్వేషన్ శాతం 50%నికి కుదించి చట్టం చేసినప్పుడు, ఈడబ్ల్యూఎస్ 10% రిజర్వేషన్ కేంద్రం చేసిన 103 వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఆగ మేఘాల మీద రాష్ట్రంలో అమలు చేసినప్పుడు బీసీ ప్రజలకు జరిగిన అన్యాయం గురించి ఏ నాయకుడు, ముఖ్యంగా బీసీ నాయకులుకూడా నోరెత్తలేని పరిస్థితి, అదేవిధంగా 42% రిజర్వేషన్లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించారని రాష్ట్ర బిజెపి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు, విమర్శిస్తున్నారు, కానీ బిజెపి పాలిత రాష్ట్రాలలో బీసీల రిజర్వేషన్లలో ముస్లింలకు రిజర్వేషన్ అమలు జరుగుతున్న విషయం వాళ్లకు తెలియనివిషయం కాదు, తెలంగాణలోని బీసీ ప్రజలపై ఎలాంటి చిత్తశుద్ధి ఉన్న తెలంగాణ బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చి రాష్ట్ర పెండింగ్ బిల్లులను రాష్ట్రపతిచే ఆమోదింపజేయాల్సిన అవసరం వుంది. బీసీ ప్రజలకు కల్పించాల్సిన 42% రిజర్వేషన్ రాజకీయ పార్టీలు పొలిటికల్ మైలేజ్ కోసం పాకులాడుతూ పక్కదారి పట్టించే పద్ధతికి స్వస్తి పలకాలి.బీసీ ప్రజలకు 42% రిజర్వేషన్ విషయంలో ఈ పార్టీలు అనుసరిస్తున్న ద్వంద విధానాలను తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. మొత్తానికి రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల రాజకీయ ఆటలో బీసీ ప్రజలకు తీరని అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అన్ని పార్టీలది.

## మరి ఈడబ్ల్యూఎస్ ఎలా సాధ్యమైంది?

ఏడు రోజుల్లో ఈడబ్ల్యూఎస్ 10% రిజర్వేషన్స్ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమైనప్పటికీ, ఎలాంటి ఎంపిరికల్ డాటా లేనప్పటికీ, ఎస్సీ ఎస్టీ బీసీల రిజర్వేషన్స్ కు వర్తింపజేసిన" తగిన ప్రాతినిధ్యం లేనప్పుడు" అనే నిబంధనను ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ కు వర్తింప చేయలేదు, మొత్తం రిజర్వేషన్స్ కు 50% పరిమితిని కూడా వర్తింప చేయలేదు, రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రకారం రిజర్వేషన్ కల్పించాలంటే సామాజికంగా, విద్యాపరంగా, వెనుకబాటు అంశాన్ని పరిగణలోకి తీసుకోలేదు, ఇన్ని అతిక్రమనలను ఒక్క రాజ్యాంగ సవరణతో అధికమించడానికి 15 ఆర్టికల్ కు 6 ను చేర్చి, అదేవిధంగా 16 ఆర్టికల్ కు 6 ను చేర్చి, ఏ కోర్టులో ను సవాల్ చేయకుండా పకడ్బందీగా ఈడబ్ల్యూఎస్ 10% రిజర్వేషన్స్ ఉన్నత కులాలకు దేశవ్యాప్తంగా అమలుజరుగుతున్న విషయం ఈ పార్టీలనాయకులకు తెలియని విషయమా! రాజ్యాంగబద్ధంగా బీసీ ప్రజలకు 42% రిజర్వేషన్ కల్పించడానికి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు, కావున బీసీ ప్రజలు కోర్టుల ముందు ధర్నాలు కాదు చేయవలసింది, నాయకుల ఇండ్ల ముందు ధర్నాలు చేయాలి, బీసీ ప్రజలు రాజకీయ పక్షాలపై ఒత్తిడి పెంచాలి,రాజకీయపక్షాలన్నీ ఐక్యంగా ఢిల్లీకి పంపాల్సిన అవసరం ఉంది.

రాజ్యాంగబద్ధ హక్కుల కోసం బీసీ ప్రజలు గ్రామ, గ్రామాన ఉద్యమ నగారా మోగించాలి, ఓటు బ్యాంకు చైతన్యంతో పార్టీలకు తగిన గుణపాఠం చెప్పడానికి,సామాజిక తెలంగాణ సాధనకై బీసీలు మరో తెలంగాణ ఉద్యమానికి సిద్ధం కావాలి. బీసీల 42% రిజర్వేషన్ స్థానిక సంస్థలలోనె కాదు, విద్యా ఉద్యోగాలలో, చట్టసభలలో మహిళా రిజర్వేషన్ తో పాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ సాధించాలంటే, మొత్తం రిజర్వేషన్ 50% పరిమితిని ఎత్తివేయడానికి రాజ్యాంగ సవరణతోనే సాధ్యమవుతుంది కావున బిసి ప్రజలు దీర్ఘకాలిక ఉద్యమానికి మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావలసిన అవసరం ఉంది.



అక్కల బాబు గౌడ్
స్టేట్ జనరల్ సెక్రటరీ,
సమాజ్ వాది పార్టీ, తెలంగాణ
9704356216



# రొమ్ము క్యాన్సర్.. జాగ్రత్త!

...నేడు రొమ్ము క్యాన్సర్ అవగాహన దినోత్సవం....

రొమ్ము కణాలలో అభివృద్ధి చెందుతున్న క్యాన్సర్‌ను రొమ్ము క్యాన్సర్ (కణితి) అంటారు. ఇది మహిళల్లో సాధారణంగా వచ్చే క్యాన్సర్లలో ఒకటి. రొమ్ము తిత్తులు అనేవి ఒకటి లేదా రెండు రొమ్ములలో కనిపించే క్యాన్సర్ కాని గడ్డలు. అవి సాధారణం, వృద్ధాప్యం, హార్మోన్ల మార్పులతో రొమ్ములో మార్పులు కారణంగా సహజంగా సంభవిస్తాయి. కణాలలో వేగవంతమైన, అనియంత్రిత కణ విభజన కారణంగా రొమ్ము క్యాన్సర్ వస్తుందని వైద్యులు అంటున్నారు.

ఇన్వేసివ్ బ్రెస్ట్ కార్సినోమా: పైన పేర్కొన్న బ్రెస్ట్ కార్సినోమా చుట్టుపక్కల కణజాలాలకు వ్యాపించినప్పుడు, వాటిని ఇన్వేసివ్ డక్టల్ కార్సినోమా, ఇన్వేసివ్ లోబ్యులర్ కార్సినోమా అంటారు.

మెటాస్టాటిక్ రొమ్ము క్యాన్సర్: రొమ్ము క్యాన్సర్ రక్తం లేదా శోషరసం ద్వారా సుదూర అవయవాలకు వ్యాపిస్తుంది, ఈ ప్రక్రియను మెటాస్టాసిస్ అంటారు. మెటాస్టాటిక్ రొమ్ము క్యాన్సర్ ఎముకలు, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, మెదడు వంటి అవయవాలకు వ్యాపించవచ్చు.

పురుషుల రొమ్ము క్యాన్సర్: అరుదైన సందర్భాల్లో, పురుషులలో కూడా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ కావచ్చు. పురుషుల రొమ్ము క్యాన్సర్ సాధారణంగా కొన్ని మందులు లేదా అసాధారణ హార్మోన్ (ఈస్ట్రోజెన్) స్థాయిలు లేదా రొమ్ము క్యాన్సర్ బలమైన కుటుంబ చరిత్ర ఫలితంగా ఉంటుంది. ఇతర తక్కువ సాధారణ రకాల రొమ్ము క్యాన్సర్లలో మెడల్లరీ కార్సినోమా, మ్యూసినస్ కార్సినోమా, పాపిల్లరీ కార్సినోమా, ఇన్ఫ్లమేటరీ కార్సినోమా, ఫైలోడ్ ట్యూమర్లు ఉన్నాయి.

## రొమ్ము క్యాన్సర్ కారణాలు:

**హార్మోన్ల అసమతుల్యత, వంశపారంపర్య లేదా కుటుంబ చరిత్ర**
**వాపు, జీవనశైలి, పర్యావరణ కారకాలు**

## లక్షణాలు:

రొమ్ము లోపల గట్టిపడటం లేదా ముద్ద, ఇది పొరుగు కణజాలం కంటే భిన్నంగా అనిపిస్తుంది.

రొమ్ము ఆకారం, పరిమాణం లేదా రూపంలో మార్పు

రొమ్ము చర్మంపై గుంటలు లేదా గుంటలు ఏర్పడటం, దీనివల్ల అది నారింజ తొక్కలా కనిపిస్తుంది.

గతంలో తిరగబడని తలకిందులుగా ఉన్న చనుమొన

చనుమొన చుట్టూ లేదా రొమ్ముపై ఎక్కడైనా చర్మం ముదురు రంగులోకి మారడం లేదా పొరలుగా మారడం, ఊడిపోవడం.

రొమ్ము చర్మం ఎరుపు రంగులో మార్పు వంటిది

పైన పేర్కొన్న ఏవైనా లక్షణాలను మీరు గమనించినట్లయితే లేదా సందేహం ఉంటే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. అవసరమైతే, మీ వైద్యుడు మిమ్మల్ని ఆంకాలజిస్ట్ వద్దకు పంపవచ్చు. ముఖ్యంగా 30 సంవత్సరాల తర్వాత మొదటి బిడ్డను కన్న మహిళలకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా.. వృద్ధాప్యం, అధిక బరువు/ ఊబకాయం, రొమ్ములలో ఒకదానిలో రొమ్ము పరిస్థితులు లేదా క్యాన్సర్ గత వైద్య చరిత్ర

ముఖ్యంగా చిన్న వయస్సులో సోదరి, తల్లి లేదా కుమార్తె వంటి కుటుంబంలో రొమ్ము క్యాన్సర్ కేసు ఉన్నా, రుతుక్రమం ఆగిపోయిన తర్వాత హార్మోన్ చికిత్స పొందుతున్న మహిళలు, రేడియేషన్‌కు ఎక్కువ కాలం గురికావడం, చిన్న వయసులోనే ఋతుస్రావం ప్రారంభం లేదా మెనోపాజ్ సమయంలో ఆలస్యంగా ఋతుస్రావం ముగియడం, అధికంగా మద్యం సేవించడం తదితర కారణాలతో ఈ వ్యాధి వస్తుంది. బీఆర్సీఏ1, 2 జన్యు ఉత్పరివర్తనలు రొమ్ము క్యాన్సర్‌తో ముడిపడి ఉన్నాయి. రొమ్ము క్యాన్సర్ అవగాహన అనేక ప్రాణాలను కాపాడుతుంది.



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.